సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | గురువారం 15 జనవరి 2026 | సంపుటి: 01 | సంచిక: 328 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com







పాఠకులకు, ప్రకటనకర్తలకు , శ్రేయోభిలాషులకు

మకర సంక్రాంతి

## శుభాకాంక్షలు

నేడు మకర సంక్రాంతి సందర్భంగా పత్రికా కార్యాలయా నికి సెలవు. కావున రేపు(శుక్ర వారం) సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.



## పొంగలి వండిన మోదీ

### మురుగున్ నివాసంలో వేడుకలు

న్యూఢిల్లీ,జనవరి14(అడుగు న్యూస్): పొంగల్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా తొలుత ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రధాని నిర్వహించారు. అనంతరం ఆయనే స్వయంగా పొంగల్ వండారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోవులకు పూజ చేశారు. పొంగల్ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. మరోవైపు ఈ పొంగల్ వేడుకను పలువురు ప్రముఖులు ఘనంగా జరుపుకుంటున్నారు. అలానే దేశ వ్యాప్తంగా ప్రజలు వివిధ రకాల వంటకాలు చేసుకుని, ఇళ్లను అలకరించుకుని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.

## ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడి!

- 24 గంటల్లోనే దాడులని కథనాలు!
- సర్వసన్నద్ధంగా ఇరాన్ సైన్యం
- గగనతలం మూసివేత, పలు ఫ్లైట్లు రద్దు
- ఇరాన్ ఆందోళనల్లో 2,571 మృతి
- రోజురోజుకూ పెరుగుతోన్న మృతుల సంఖ్య
- ఆందోళనకారులను శిక్షిస్తే ప్రతిచర్యలు తీవ్రం
- ఇరాన్‌కు ట్రంప్ మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్



న్యూఢిల్లీ,జనవరి14(అడుగు న్యూస్): ఆర్థిక సంక్షోభంతో అట్టుడుకుతున్న ఇరాన్‌లో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మృతి చెందారు. ఈ మేరకు అమెరికా కేంద్రంగా పని చేసే మానవ హక్కుల ఉద్యమకారుల వార్తా సంస్థ బుధవారం వెల్లడించింది. వీరిలో 2,403 మంది ఆందోళనకారులు కాగా 147 మంది భద్రతా సిబ్బంది, ప్రభుత్వానికి చెందినవారు ఉన్నట్లు వివరించింది. ఇంకా ఆందోళనలతో సంబంధం లేని 12 మంది చిన్నారులు, మిగతా 2లో..

## కామారెడ్డిలో 600 కుక్కల హతం!

### చంపి, పాతేపెంచిన సర్పంచ్‌లు జంతు ప్రేమికుల ఫిర్యాదుతో వెలుగులోకి

కామారెడ్డి,జనవరి14(అడుగు న్యూస్): మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు.. మిగతా 2లో..

### పురపాలికల్లోనూ బీసీలకే

# పెద్ద పీట

### అన్ని స్థానాల్లోనూ మహిళలకు సగం

డెడికేటెడ్ కమిషన్ సిఫారసులతో 34% ఖరారు

జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు

జీవో జారీ చేసిన మున్సిపల్ పరిపాలన శాఖ




హైదరాబాద్, జనవరి14(అడుగు న్యూస్): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా పురపాలక శాఖ కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 121 మున్సిపాలిటీలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా కేటగిరీలకు చైర్‌పర్సన్ స్థానాల సంఖ్యను పురపాలకశాఖ ఖరారు చేసినట్లు సమాచారం. జనాభా ప్రాతిపదికన ఏ ఏ కేటగిరీలకు ఎన్ని స్థానాలు కేటాయించాలనే అంశంపై స్పష్టతనిస్తూ ప్రాథమిక జాబితాను సిద్ధం చేశారు. మునిసిపాలిటీ చైర్మన్ల సంఖ్య విభాగాల వారీగా.. జనరల్ 30, జనరల్ మహిళలు 31 స్థానాలు, ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8, బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19 స్థానాలను కేటాయించాలని పురపాలకశాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు మిగతా 2లో..

## తెలంగాణలో మున్సిపల్ సందడి

**షెడ్యూల్ కు ముందే పార్టీల సన్నద్ధం**

**ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం**

హైదరాబాద్, జనవరి14(అడుగు న్యూస్): మొన్నటిదాకా రామీణ ఓటరు పల్స్ పట్టుకోవడంతో తెగ పోటీపడి, పంచాయతీ ఎన్నికల్ని రంజుగా మార్చేశాయి పార్టీలు. ఇక ఇప్పుడు అర్బన్ ఓటరు వంతు. బస్తీ ఓటరును ఫిదా చేయడమెలా? మరో నెలరోజుల్లో వచ్చే మున్సిపల్ వార్‌లో నెగ్గడం ఎలా?అనే ఆలోచనతో పార్టీలు దూకుడు పెంచాయి. ఈ మేరకు నేతల నుంచి డైనమైట్లు లాంటి డైలాగులు మిగతా 2లో..

## ‘ధరణి’ నుంచి భూ భారతి దాకా..

- తవ్విన కొద్దీ... మోసాలే!
- ఆశాఖ అధికారులపైనా అనుమానాలు
- రిజిస్ట్రేషన్ల కూపీ లాగుతున్న అధికారులు




హైదరాబాద్,జనవరి14(అడుగు న్యూస్): ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి ఎన్ని లావాదేవీల్లో ఇలాంటి పొరపాట్లు జరిగి ఉంటాయనే దానిపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.వందల కోట్ల విలువైన భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో మాత్రం రుసుం మొత్తంలో నామమాత్రంగా 1శాతం చెల్లించినా లావాదేవీలు పూర్తయ్యాయి. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉంటే... దస్త్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్ట్రార్లు మిన్నకున్నారు. 2020లో ప్రైవేటు సంస్థ ద్వారా ప్రారంభమైన ధరణి నుంచి ప్రస్తుత భూభారతి వరకు... అనేక సాంకేతిక లోపాలు కనిపించడం గమనార్హం. మిగతా 3లో..

## మకరజ్యోతి దర్శనం

### అయ్యప్ప జపంతో మార్మోగిన శబరిమల కొండలు

తిరువనంతపురం,జనవరి14(అడుగు న్యూస్): శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా మిగతా 3లో..



## ఎమర్జెన్సీ పరిస్థితే ఉంటే.. మీరిలా తిరిగేవారా?

- మీరంతా లోపలే ఉండేవారు!
- మహిలా ఐఏఎస్ వ్యక్తిత్వ హననం కేసులో
- ఎన్టీవీ విలేకరుల అరెస్ట్ పై సీపీ సజ్జనార్
- విచారణకు వస్తామని ఫోన్లు ఆఫ్ చేశారు
- ఆ చానల్ సీఈఓ ఎక్కడున్నా విచారణకు రావాలి
- పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అరెస్ట్ లు
- ఏ తప్పూ చేయకపోతే భయమెందుకు?
- ఓ చానల్ ఇన్ పుట్ ఎడిటర్, రిపోర్టర్ అరెస్ట్
- మరో రిపోర్టర్ విచారణ, నోటీసులు
- 44 యూట్యూబ్ చానెళ్ల గుర్తింపు

హైదరాబాద్,జనవరి14(అడుగు న్యూస్): తెలంగాణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరఫున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి మిగతా 2లో..



## వ్యక్తిత్వ హననాన్ని సహించం

**తప్పుడు వార్తలు సరికాదు**

**మహిళా ఐఎఎస్ కేసుపై డీజీపీ శివధర్ రెడ్డి**

హైదరాబాద్, జనవరి1(అడుగు న్యూస్): చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి మిగతా 2లో..

## ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ పాలన : కేటీఆర్

### పండగపూట కక్షసాధింపు చర్యలా? : హరీశ్ రావు

హైదరాబాద్,జనవరి14(అడుగు న్యూస్): ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై మిగతా 2లో..

## విచారణకు ముందే అరెస్టులెందుకు? : కిషన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి14(అడుగు న్యూస్): తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల మిగతా 2లో..

## వలపు వల!

- వందలాది మంది విలవిల!!
- భార్యాభర్తల గలీజు దందా
- అసభ్య ఫోటోలతో ఇన్‌స్టాలో ఎర!
- గుట్టుగా భర్త వీడియోల చిత్రీకరణ
- ఆతర్వాత బ్లాక్ మెయిల్, భారీగా వసూళ్ళు
- బాధితుల్లో ప్రముఖులు.. నిందితుల అరెస్టు
- కరీంనగర్ జిల్లాలో వెలుగులోకి దారుణం

కరీంనగర్, జనవరి 14 (అడుగు న్యూస్): ఇన్‌స్టాగ్రామ్‌ను వేదికగా చేసుకుని అర్ధనగ్న ఫొటోలు, వీడియోలతో వల విసిరి అమాయకులను బ్లాక్‌మెయిల్ చేసిన కరీంనగర్‌కు చెందిన దంపతుల గుట్టును పోలీసులు బట్టబయలు చేశారు. రెండు మిగతా 2లో..

## సంపాదకీయం
## మార్గం - అడుగు



### సూర్యుడి ఉత్తరాయణమే సంక్రాంతి!

సంక్రాంతి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. అది కాలగమనంలో జరిగే మహత్తర మార్పుకు సూచిక. చలికాలం ముగిసి, వెచ్చని రోజులకు స్వాగతం పలికే సంధికాలమే మకర సంక్రాంతి. ప్రకృతిలో మార్పు ఎంత సహజమో, మన జీవనశైలిలో మార్పు కూడా అంతే అవసరమని గుర్తుచేసే పండుగ ఇది. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణానికి ప్రయాణం ప్రారంభించే ఘట్టం సంక్రాంతి. ఈ ఖగోళ పరిణామాన్నే మన ఋషులు పండుగగా మలిచి, దానిలో శాస్త్రీయతతో పాటు ఆధ్యాత్మికతను జోడించారు.

మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. దీన్నే ఉత్తరాయణారంభంగా పరిగణిస్తారు. హిందూ సంప్రదాయంలో ఉత్తరాయణం దేవతలకు సంబంధించిన పుణ్యకాలంగా భావిస్తారు. అందుకే ఈ కాలంలో వివాహాలు, గృహప్రవేశాలు, నామకరణాలు, కొత్త వ్యాపారాలు వంటి శుభకార్యాలపై ఉన్న నిషేధం తొలగిపోతుంది. ఇది కేవలం మతపరమైన నమ్మకం మాత్రమే కాదు. వ్యవసాయం, వాతావరణం, మానవ జీవన చక్రానికి అనుకూలమైన కాలమనే వాస్తవికత కూడా ఇందులో దాగి ఉంది.

హిందూ పండుగలన్నీ ప్రకృతి ఆధారితమైనవే. సూర్య, చంద్రగతులు, ఋతువుల మార్పులు పండుగల రూపంలో మానవ జీవనంలోకి వచ్చాయి. సంక్రాంతి కూడా అలాంటి పండుగే. పంటలు కోసి గోదాముల్లో చేరే వేళ రైతు ఆనందాన్ని పంచుకునే సందర్భమే ఇది. అందుకే దీన్ని 'పంటల పండుగ'గా వ్యవహరిస్తారు. అయితే దీనిలోని సందేశం పంటలకే పరిమితం కాదు. ఇది మన ఆలోచనల్లో, జీవన విధానంలో మార్పులకు పిలుపునిచ్చే పండుగ.

ఈ సంవత్సరం మకర సంక్రాంతి రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం అయిన షట్తిల ఏకాదశి కూడా కలవడం విశేషం. ఈ అరుదైన యోగంలో చేసే పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు సాధారణ రోజుల కంటే అనేక రెట్లు పుణ్యఫలితాన్ని ఇస్తాయని పండితుల అభిప్రాయం. ఈ ఆధ్యాత్మిక విశిష్టత సంక్రాంతి ప్రాముఖ్యతను మరింత పెంచుతోంది.

తెలంగాణ, ముఖ్యంగా ఏపీలో సంక్రాంతి అంటే సంబరాల సమాహారం. రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, బసవన్నల నాట్యాలు, గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబాలు. పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు ఇరుగు పొరుగు వారికి పంచడం సామాజిక ఐక్యతకు నిదర్శనం. గాలిపటాలు ఎగరేసే పిల్లల ఆనందం, బంధువుల కలయిక సంక్రాంతిని ఒక సమగ్ర సామాజిక పండుగగా నిలబెడతాయి.

సంక్రాంతి ఆచారాల్లోని శాస్త్రీయతను గమనిస్తే మరింత ఆసక్తికరంగా ఉంటుంది. తెల్లవారుజామున లేచి స్నానం చేయడం, సూర్యారాధన చేయడం ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తుంది. చలికాలంలో శరీరంలో పేరుకుపోయిన శ్లేష్మాన్ని తగ్గించడంలో సూర్యస్నానం ఉపకరిస్తుంది. ఆవుపేడ కలిపిన నీటితో ఇంటిముందు చల్లడం, సున్నం, పసుపుతో ముగ్గులు వేయడం వంటివి శుభ్రతతో పాటు సూక్ష్మజీవులను నశింపజేసే సహజ పద్ధతులు. సంప్రదాయం పేరుతో మనకు అందిన ఈ ఆచారాలు నిజానికి ఆరోగ్య రక్షణకు ఉపయోగపడే విజ్ఞానం.

సంక్రాంతి నైవేద్యాల్లో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ప్రధానమైనవి. పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం వంటి పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. అంటే పండుగ వంటకాలు కూడా ఋతువుకు అనుగుణంగా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందినవే.

భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ, ఈ నాలుగు రోజుల పండుగ శ్రేణి మన జీవనంలో శుచిత్వం, దానగుణం, ఆనందం, కృతజ్ఞతను నింపుతుంది. పాతదాన్ని విడిచిపెట్టి కొత్తదానికి స్వాగతం పలకడమే భోగి భావం. సూర్యుడికి కృతజ్ఞత తెలుపుకోవడమే సంక్రాంతి సారాంశం. పశుసంపద ప్రాధాన్యతను గుర్తుచేసేది కనుమ. బంధుత్వాల బలాన్ని చాటేది ముక్కనుమ.

సంక్రాంతి ఒక పండుగ మాత్రమే కాదు. అది జీవన తత్త్వం. చీకటి నుంచి వెలుగువైపు, నిరుత్సాహం నుంచి ఉత్సాహం వైపు, అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు సాగే ప్రయాణానికి ప్రతీక. కాలచక్రంతో పాటు మన ఆలోచనలను కూడా ఉత్తరాయణ దిశగా మలుచుకోవాలని సంక్రాంతి మనకు ఇచ్చే మౌన సందేశం.

## ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడి!

మొదటిపేజీ తరువాయి..

9 మంది పౌరులు చనిపోయినట్లు తెలిపింది. ఈ ఘర్షణల్లో మరణాల సంఖ్య మరింత పెరగొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు 18,000 మందికి పైగా నిరసనకారులను భద్రతాధికారులు అరెస్ట్ చేశారు.మరోవైపు పౌరులపై తీవ్ర స్థాయిలో హింసకు పాల్పడుతున్న ఇరాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. పౌరులతో మర్యాదగా ప్రవర్తించాలని ఇరాన్‌ను హెచ్చరించారు. ఇరాన్‌లో హత్యలకు సంబంధించిన సంఖ్యను తెలుసుకుని, అక్కడి పరిస్థితిని



సమీక్షిస్తామని చెప్పారు.ఇరాన్‌లో ప్రజాస్వామ్యాన్ని చూడాలని అనుకుంటున్నాం. ఇలా ప్రజలను చంపడాన్ని చూడాలని అనుకోవడం లేదు. అక్కడి ప్రజలకు కొంత స్వేచ్ఛ లభించాలని కోరుకుంటున్నాము. అక్కడి ప్రజలు చాలా ఏళ్లుగా నరకం అనుభవిస్తున్నారు. ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టే స్నేహితులు నాకు చాలా మంది ఉన్నారు. అక్కడి పెట్టుబడులతో వారు బాగా లాభపడ్డారు. ఇరాన్ ఒక గొప్ప ప్రదేశం, అక్కడి ప్రజలు గొప్పవారు. ఒకప్పుడు నాయకత్వం కూడా బాగుండేది, కానీ ఇప్పుడు అది నరకంలో మగ్గుతోందని అన్నారు. ఇప్పటికే ఆందోళనకారులపై ఉక్కుపాదం మోపిన ఇరాన్, తాజాగా ఓ నిరసనకారుడికి మరణశిక్ష అమలు చేసేందుకు సిద్ధమైంది. ఆందోళనల్లో పాల్గొన్న 26 ఏళ్ల ఇర్ఫాన్ సోల్తానిని ఇటీవల అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే బుధవారం అతడిని బహిరంగంగా ఉరితీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు మానవహక్కుల సంఘాలు, మీడియా కథనాలు ప్రచురించాయి. కాగా, ఈ వార్తలపై స్పందించిన ట్రంప్, అలాంటి పనులు చేస్తే తమ ప్రతిచర్య చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.అటు అమెరికా బెదిరింపులపై ఇరాన్ స్పందించింది. ఇరాన్ పౌరుల పాలిట ప్రధాన హంతకులు ఇద్దరే ఇద్దరంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఇరాన్‌లో ఆందోళనలు జరిగేలా ఆ రెండు దేశాలే రెచ్చగొడుతున్నాయని దుయ్యబట్టింది.

## ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ పాలన : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..

పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా– డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి..



ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు. సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు.జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

## వలపు వల!

మొదటిపేజీ తరువాయి..

సంవత్సరాలుగా సాగుతున్న ఈ గలీజు దందాలో వ్యాపారులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, యువకులు బాధితులుగా మారారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కరీంనగర్ రూరల్ పోలీసులు నిందితులైన దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఈ దంపతులు పదేళ్లుగా కరీంనగర్‌లోని ఆరెపల్లిలో నివాసం ఉంటున్నారు. భర్త గ్రానైట్, ఇంటీరియర్ డిజైన్ వ్యాపారం చేస్తుండగా నష్టాలు రావడంతో సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ కుట్రకు పాల్పడ్డారు. భార్యకు ఇన్‌స్టాగ్రామ్‌లో 1200 మందికి పైగా ఫాలోవర్లు ఉండగా, అర్ధనగ్న ఫొటోలు పోస్టు చేసి ఆకర్షించేది. ఆమెను సంప్రదించిన వారితో డబ్బు తీసుకుని ఏకాంతంగా గడుపుతుండగా, భర్త గుట్టుగా వీడియోలు చిత్రీకరించేవాడు. అనంతరం ఆ వీడియోలను చూపిస్తూ బ్లాక్‌మెయిల్‌కు దిగుతూ డబ్బులు వసూలు చేసేవారు. వీడియోలు సోషల్ మీడియాలో పెడతామని బెదిరించడంతో చాలామంది భయపడి డబ్బులు ఇచ్చారు. ఈ విధంగా వసూలు చేసిన డబ్బుతో రూ.65 లక్షల విలువైన ప్లాట్, ఖరీదైన ఫర్నిచర్, రూ.10 లక్షల కారు కొనుగోలు చేశారు. తన ఫాలోవర్లలో సుమారు 100 మందితో ఆమెకు సంబంధాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఏడాది క్రితం పరిచయమైన కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.14 లక్షలు వసూలు చేసిన దంపతులు, మరో రూ.5 లక్షలు ఇవ్వకపోతే వీడియోలు బహిర్గతం చేస్తామని, చంపేస్తామని బెదిరించడంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దంపతులను అరెస్టు చేసి, కారు, మొబైల్ ఫోన్లు, నగదు, చెక్కును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు.

## ఎమర్జెన్సీ పరిస్థితే ఉంటే.. మీరిలా తిరిగేవారా?

మొదటిపేజీ తరువాయి..

తీసుకున్నారు పోలీసులు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు.అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం.త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి.

సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు. తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాలు ప్రసారం ఘటన తీవ్ర దుమారాన్ని రేపుతోంది. మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచిన కేసును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు సంస్థ సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ నడువనుంది. ఇదిలా ఉండగా.. మహిళా అధికారిపై అసత్య కథనాలు ప్రసారం చేయడంపై సీపీ సజ్జనార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరమని అన్నారు. ఇకపై మహిళలను అవమానిస్తే సహించేది లేదని సీపీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహిళలపై విమర్శ కాదు.. దుష్ప్రచారం నేరం. ప్రజా జీవితంలో విమర్శలు సహజమే. కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు, చరిత్ర హననం, అసభ్య వ్యాఖ్యలు విమర్శలు కావు.. అవి క్రూరత్వం. ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, గృహిణి అయినా మహిళ గౌరవం అపరిమితం. టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, వార్త కథనాల పేరుతో మహిళలపై దూషణలు అసహ్యకరం. నేడు ప్రతి పనిలో మహిళలు ముందువరుసలో నాయకత్వం వహిస్తున్నారు. పాలన, పోలీసు శాఖ, శాస్త్ర రంగం, మీడియా సహా ప్రజాజీవితంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇల్లు–ఉద్యోగం రెండింటినీ సమతుల్యం చేస్తున్నారు మహిళలు. కనిపించని బాధ్యతలతో కుటుంబాన్ని నడుపుతూ.. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు ప్రగతిపై దాడులే. భారతీయ సంప్రదాయం చెబుతున్న సందేశం ప్రకారం 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' .. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షం ఉంటుంది. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరం. వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మహిళలను గౌరవించని సమాజం భవిష్యత్తును కోల్పోతుంది. ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే నష్టం. స్పష్టమైన సందేశం ఒక్కటే.. మహిళలపై అవమానం, వివక్ష, చరిత్ర హననం ఇక సహించబోము. ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్.. ఆ భవిష్యత్తు గౌరవంతోనే నిర్మితమవుతుంది.. అవమానంతో కాదు' అంటూ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు.

## విచారణకు ముందే అరెస్టులెందుకు? : కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

## వ్యక్తిత్వ హననాన్ని సహించం

మొదటిపేజీ తరువాయి..

భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్లలో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. 'సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు. వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననంపై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశర చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్కులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరోమారు స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పురపాలికల్లోనూ బీసీలకే పెద్ద పీట

మొదటిపేజీ తరువాయి..

సమాచారం. మూడు రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.మునిసిపాలిటీ చైర్మన్ల రిజర్వేషన్ల స్థానాల సంఖ్యను ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం, ఏయే మున్సిపాలిటీ ఏ వర్గానికి కేటాయించాలనే (లక్కీ డిప్ లేదా రోస్టర్ విధానం) తుది రిజర్వేషన్లను ఈ నెల 17న అధికారికంగా ప్రకటించనుంది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. అభ్యర్థులు తమ తమ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.తెలంగాణలో మూడు విడతల్లో ఉత్కంఠభరితంగా సాగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులు స్పష్టమైన ఆధిపత్యం చెలాయించారు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికార పార్టీ అభ్యర్థులు దాదాపుగా క్లీన్ స్వీప్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ అంశాలు ఓటర్లపై సానుకూల ప్రభావం చూపినట్లు కనిపిస్తున్నాయి. అయితే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులే గెలుస్తారని తెలిసిందే. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా గట్టి పోటీని ఇచ్చింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని నియోజకవర్గాల్లో, సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు మెరుగైన ఫలితాలు సాధించారు. బీజేపీ కూడా ఈసారి గ్రామీణ స్థాయిలో తన పట్టును నిరూపించుకుంది, ముఖ్యంగా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతుదారులు గణనీయమైన స్థానాల్లో విజయం సాధించారు.

## తెలంగాణలో మున్సిపల్ సందడి

మొదటిపేజీ తరువాయి..

పేలుతున్నాయి.ఫిబ్రవరిలోనే మున్సిపల్ జరిగే అవకాశం ఉంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఏ క్షణంలోనైనా షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. రాజకీయ పార్టీలు కూడా బస్తీ మే సవాల్ అంటున్నాయి. ఈ నెల 16 నుంచి మున్సిపాలిటీల్లో సీఎం రేవంత్ ప్రచారానికి సిద్ధమయ్యారు. అపోజిషన్ పార్టీ బీఆర్ఎస్ అంతకుముందే మేలుకుంది. జిల్లా స్థాయి సమావేశాలతో లీడర్లను కేటీఆర్ అప్రమత్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, సీనియర్ లీడర్లు, పార్టీ జిల్లా ప్రెసిడెంట్లతో వరుసగా భేటీ ఔతూ వాళ్లలో భరోసా నింపుతున్నారు. 4వేలకు పైగా గ్రామపంచాయతీల్లో గెలిచాం, రెండేళ్లలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ స్థాయిలో పెరిగిందో దీన్ని బట్టే అర్థమౌతోందంటూ క్యాడర్‌కి గులాబీ పార్టీ అధిష్ఠానం బూస్ట్ ఇస్తోంది. సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని చేరికల సమయంలో మాజీ మంత్రి హరీశ్ రావు సుతిమెత్తగా తనదైన ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారు.

## కామారెడ్డిలో 600 కుక్కల హతం!

మొదటిపేజీ తరువాయి..

సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్‌పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి గ్రామ పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..
RNI No : APTEL/2010/35251

# భోగి మంటల్లో కాంగ్రెస్ హామీలు

పాలకుర్తి, జనవరి 14 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీలపై బీఆర్ఎస్ యూత్ విభాగం నిరసన చేపట్టింది. జిల్లా నాయకులు మహేందర్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్



నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలు, 420 హామీలతో కూడిన మేనిఫెస్టో కరపత్రాలను భోగి మంటల్లో వేసి కాల్చారు. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ, రెండేళ్లు గడిచినా హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన వైఖరికి నిరసనగానే ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో లకావత్ వెంకట్ నాయక్, సతీష్ కుమార్, శోభన్ ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, యశ్వంత్, రవివర్మ, దారావత్ ప్రవీణ్, దారావత్ సుధాకర్, మల్లేష్, అంజనేయులు, బానోత్ సురేష్, తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరులో కబడ్డీ క్రీడోత్సవాలు

పాలకుర్తి, జనవరి 14 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, గూడూరు గ్రామంలో కీ.శే. వడ్లకొండ హర్షవర్ధన్ రెడ్డి స్మారకార్థం గ్రామస్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు,



స్నేహితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడలకు స్థానిక ఎస్సై పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు, పూర్వ విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు టీములుగా పాల్గొన్నారు. భవాని యూత్ గూడూరు జట్టు ప్రథమ బహుమతి రూ.5016 గెలుచుకోగా, గోపాలపురం జట్టు ద్వితీయ బహుమతి రూ.3016 సాధించింది. ఈ కార్యక్రమంలో విజయ వెంకట్ రెడ్డి, సర్పంచ్ మాచర్ల స్వరూప, ఉప సర్పంచ్ గుగ్గిళ్ల కళ్యాణ్, బోరెడ్డి మల్లారెడ్డి, గుగ్గిళ్ల ప్రేమ్ కుమార్, బోయిన రవి, మాచర్ల పుల్లయ్య, బసిరెడ్డి అజిత్, చింతల రఘువరన్, వడ్లకొండ తేజ, మడత రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అరెస్టులపై ఎర్రబెల్లి ఆగ్రహం

తొర్రూరు, జనవరి 14 (అడుగు న్యూస్): సంక్రాంతి పండుగ సందర్భంగా వరంగల్ జిల్లా ఐనవోలు మండలంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శ్రీమతి ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు



ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఆ తర్వాత ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 1000 హెల్మెట్లను పంపిణీ చేసి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు. ఇదిలా ఉండగా జర్నలిస్టుల అక్రమ అరెస్టులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్రంగా ఖండిస్తూ, పత్రికా స్వేచ్ఛను హరించే చర్యలను సహించబోమని, జర్నలిస్టులకు బీఆర్ఎస్ పూర్తి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# మకరజ్యోతి దర్శనం

మొదటిపేజీ తరువాయి..

సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్శన కోటాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది.

# ప్రభుత్వ భూముల పరిరక్షించాలి

పాలకుర్తి, జనవరి 14 (అడుగు న్యూస్): పాలకుర్తిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతోజ రజిత మాట్లాడారు. పాలకుర్తి పరిధిలో ప్రభుత్వ అసైన్డ్, ఇనాం, ఖరాజ్ ఖాతా, కాందిశీకుల భూములు కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల తేడా లేకుండా అక్రమంగా ఆక్రమించబడ్డాయని వారు ఆరోపించారు. అక్రమ ఆక్రమణలను కాపాడుకునేందుకు నేతలు పార్టీలు మారుతూ అధికార పార్టీలో చేరుతున్నారని విమర్శించారు. మాజీ జెడ్పిటిసి పుష్కారి శ్రీనివాసరావు ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించారని, దానిని స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. విస్నూర్లో ఎర్రబెల్లి రాఘవరావు ఖరాజ్ ఖాతా భూమిని ఆక్రమించారని, పాలకుర్తిలో మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు ఇనాం భూమిని బినామీ పేరుతో పట్టా పొందినట్లు ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వ, ప్రజా ఆస్తుల దోపిడీలో పోటీ పడుతున్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా భూములను రక్షించాలని, హైడ్రా తరహాలో ఫైడ్రా ఏర్పాటు చేయాలని కోరారు. పాలకుర్తిలో ఉన్న 1100



మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కబ్జాదారులకు అండగా నిలవకుండా ప్రజా ప్రయోజనాలకే పని చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల, క్రీడా మైదానం తదితర అవసరాల కోసం భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జీడి సోమయ్య, కొనకటి కళింగరాజు, తూర్పాటి సారయ్య, గాయాల బాబు, పెద్ది రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# యశస్విని, ఝాన్సీ రెడ్డిలపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

పాలకుర్తి, జనవరి 14 (అడుగు న్యూస్): పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి లపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం



మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావుతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి దయాకర్ రావు కక్షపూరిత రాజకీయాలు చేశాడన్న విషయం ప్రజలకు తెలుసని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో రాజకీయాలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దీనికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డే కారణమని అన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని, కాంగ్రెస్ పార్టీ ఎక్కడా అడ్డుపడలేదని స్పష్టం చేశారు. మాజీ జెడ్పిటిసి శ్రీనివాసరావు ప్రహరీ గోడ కూల్చివేతకు కాంగ్రెస్‌కు సంబంధం లేదని, అవసరమైతే రీ సర్వే చేయించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రతిపక్ష హోదాలో బాధ్యతగా వ్యవహరించాలని, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందని, పాలకుర్తిలో యశస్విని రెడ్డి గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా గోదా, రంగనాథుల కళ్యాణం

కొడకండ్ల, జనవరి 14 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, కొడకండ్ల మండలం, ఏడునూతుల





గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం గోదా, రంగనాథుల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుడు శశాంక ఆచార్యుల సమక్షంలో వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ఈ కళ్యాణాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించగా, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా ముస్తాబు చేయడంతో ఆలయం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ నూతనగంటి రాంబాబు, గ్రామ సర్పంచ్ మురాశేటి ఉమా అంజయ్య, కల్యాణ దాతలు నెల్లుట్ల సుధాకర్ రావు, నెల్లుట్ల గోపాలరావు, మాజీ దేవస్థానం కమిటీ చైర్మన్ పాము లక్ష్మీనారాయణ తదితరులు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని కన్నులారా వీక్షించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ జరగగా, ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా సాగిందని నిర్వాహకులు తెలిపారు. గోదా, రంగనాథుల కళ్యాణోత్సవంతో ఏడునూతుల గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసి, గ్రామస్థుల్లో ప్రత్యేక ఆనందం నెలకొందని స్థానికులు పేర్కొన్నారు.

# ఐనవోలు బ్రహ్మోత్సవాల్లో మంత్రి, ఎమ్మెల్యేలు

ఐనవోలు, జనవరి 14 (అడుగు న్యూస్): భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండ సురేఖ, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలించి భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టాండ్‌ను మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించి బస్సులో ప్రయాణించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ఐనవోలు ఆలయం వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భక్తుల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొంటూ, బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, పూజారులు రవీందర్ శర్మ, శ్రీనివాస్, మధు శర్మ, నరేష్ శర్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.







# నీళ్ల టాంకే బాత్ రూము!?

తెలివంటే గీయనదే! ఉపాయమంటే గిదే!! బుర్రనుపయోగిస్తే, మస్తు ఆలోశనలు శేయొచ్చు. ఖర్సూ తగ్గించుకోవచ్చు! ఇగో గీయనేం శేసిండో సూడుండ్లి.

నల్లాలు తిప్పితే నీల్లొచ్చేటందుకు ఇండ్ల మీద, మిద్దెల మీద ట్యాంకులు పెట్టుకుంటం కద. గదాన్నొకటి తీసుకున్నడు. గదాన్ని



మంచిగ కోసి, ఓ తలుపు శేసిండు. దానికి కట్కాలు, గొల్లాలు బిగించిండు. ఇగ లోపల పయాఖాన బేసిన్ పెట్టిండు. గదానికే లోపలికి నీల్లొచ్చేటట్లు నల్లాలు పెట్టిండు. ఓ లైటు బుగ్గ పెట్టిండు. గాలిపోయేటందుకు పైన మూతను పెట్టకుండ వదిలేసిండు. అంటే గా ట్యాంకును బాత్ రూం లెట్రిన్ రూం శేసిండన్నట్లు! ఖర్సు తక్కువ, ఉపయోగం ఎక్కువ ఉపాయమన్నట్లు!

# జాతర ఏర్పాట్ల పరిశీలన

దేవరుప్పుల/పాలకుర్తి, జనవరి 14 (అడుగు న్యూస్): జనగామ జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరగనున్న ఆలేటి ఎల్లమ్మ, బంజర మల్లన్న జాతరల నేపథ్యంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్







బుధవారం దేవాలయాలను సందర్శించారు. పాలకుర్తి మండలంలో ఈ నెల 16న జరిగే ఆలేటి ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ జానకీ రామ్ రెడ్డి, ఎస్సై దూలం పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే దేవరుప్పుల మండలం బంజర గ్రామ శివారులోని బంజర మల్లన్న స్వామి జాతర ఏర్పాట్లను డీసీపీ పరిశీలించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్సై ఊర సృజన్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

**ఘనంగా ఏర్పాట్లు:**

ఆలేటి ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు స్థానిక సర్పంచ్ జిట్టబోయిన రమ్య ప్రశాంత్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, రాపాక సత్యనారాయణ తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారు.

# ‘ధరణి’ నుంచి భూ భారతి దాకా..

మొదటిపేజీ తరువాయి..

త భూభారతి వరకు... అనేక సాంకేతిక లోపాలు కనిపించడం గమనార్హం. జనగామలో వెలుగుచూసిన సాగు భూముల రిజిస్ట్రేషన్ ఈ-చలానా చెల్లింపుల్లో మోసం వ్యవహారంలో రోజురోజుకు అనేక కొత్త విషయాలు బహిర్గతం అవుతున్నాయి. ఎసిబి ఎస్పీ సింధుశర్మ నేతృత్వంలోని హైలెవెల్ కమిటీ ఈ వ్యవహారంపై అన్వేషణ ప్రారంభించింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించిన ప్రకారం... భూమి మార్కెట్(బుక్ వాల్యూ) విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీ, మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2,500, పాస్ పుస్తకానికి రూ.350, హరితపన్నుగా రూ.50... ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించాలి. మార్కెట్ విలువ ఆన్‌లైన్‌లో ముందుగానే నిర్ధారించి ఉంటుంది. సర్వే నంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఎంత చెల్లించాలనేది కంప్యూటర్ తెరపైన కనిపిస్తుంది. చెల్లింపుల్లో ఏ ఒక్క రూపాయి తక్కువైనా ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా తిరస్కారానికి గురవుతుంది. కానీ, 4,800 లావాదేవీల్లో 1శాతం రుసుం మాత్రమే చెల్లించినా ఎక్కడా రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవలేదు. ధరణి/భూభారతి పోర్టల్‌లో ఉన్న బలహీన సాంకేతికత అక్రమ లావాదేవీలకు ఆస్కారం కల్పించిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ధరణిని ప్రైవేటు సంస్థ నిర్వహించగా, ఇప్పుడు భూభారతి ఎన్ఐసీ చేతిలో ఉంది. ధరణి నుంచి భూభారతిగా మారిన తర్వాత కొనసాగిన లోపాలు, ప్రస్తుతం వెలుగు చూసిన ఈ-చలాన్ల సొమ్ము దారిమళ్లింపునకు అనుమతిచ్చిన సాఫ్ట్‌వేర్ బలహీనతలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



# 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ విజయం

## డారిల్ మిచెల్ అద్భుతమైన శతకం

## కేఎల్ రాహుల్ అజేయ శతకం వృధా



# టీమిండియాకు తప్పని పరాజయం!

భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ ఓటమి నుంచి తేరుకుంది. బుధవారం రాజ్‌కోట్ వేదికగా జరిగిన రెండో వన్డేలో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. క్రిస్టన్ క్లార్క్ బౌలింగ్‌లో సత్తా చాటగా.. డారిల్ మిచెల్ అద్భుతమైన శతకంతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 284 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్( 92 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 112 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(53 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 56) హాఫ్ సెంచరీతో రాణించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్(3/56) మూడు వికెట్లు తీయగా.. కైల్ జెమీసన్, జాక్ ఫోక్స్, జైడన్ క్లార్క్, మైఖేల్ బ్రెస్‌వెల్ తలో వికెట్ తీసారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ నిరాశపర్చగా..

కేఎల్ రాహుల్( 92 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 112 నాటౌట్) అజేయ శతకంతో భారత జట్టును ఆదుకున్నాడు. 118 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును ఐదో స్థానంలో బ్యాటింగ్ వచ్చిన రాహుల్ ఆదుకున్నాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఐదో వికెట్‌కు 73 పరుగులు, నితీష్ కుమార్ రెడ్డితో ఆరో వికెట్‌కు 57 రన్స్, సిరాజ్‌తో కలిసి ఏడో వికెట్‌కు 28 పరుగులు జోడించాడు.

52 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన రాహుల్.. మరో 30 (82) బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. 96 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద జెమీసన్ బౌలింగ్‌లో సిక్సర్ బాది సెంచరీ పూర్తి చేసుకోవడం గమనార్హం. రాహుల్‌కు ఇది 8వ వన్డే సెంచరీ. ఈ మైదానంలో అత్యధిక వ్యక్తిగత వన్డే స్కోర్ కూడా రాహుల్‌దే. ఈ క్రమంలో అతను 11 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 2015లో సౌతాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్ ఈ మైదానంలో 108 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు ఈ మైదానంలో ఇదే హయ్యెస్ట్ వన్డే వ్యక్తిగత స్కోర్‌గా ఉండగా.. తాజా ఇన్నింగ్స్‌తో రాహుల్ అధిగమించాడు.

అనంతరం న్యూజిలాండ్ 47.3 ఓవర్లలో 3 వికెట్లకు 286 పరుగులు చేసి గెలుపొందింది. డారిల్ మిచెల్(117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 131 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. గ్లేన్ ఫిలిప్స్(24 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 32 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు డెవాన్ కాన్వే(16), హెన్రి నికోల్స్(10) త్వరగానే ఔటయ్యారు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడగా.. కాన్వేను హర్షిత్ రాణా క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 34 పరుగులు చేసింది. హెన్రీ నికోల్స్(10)ను ప్రసిధ్ కృష్ణ క్లీన్ బౌల్డ్ చేయగా.. విల్ యంగ్, డారిల్ మిచెల్ ఆదుకున్నారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఈ ఇద్దరూ ఆ తర్వాత దూకుడుగా ఆడారు. ఈ క్రమంలో డారిల్ మిచెల్ 52 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా... విల్ యంగ్ 68 బంతుల్లో అర్థ శతకం సాధించాడు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచిన ఈ జోడీ న్యూజిలాండ్ విజయానికి బాటలు వేసింది. సెంచరీ ముంగిట విల్ యంగ్(87)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేశాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 162 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన గ్లేన్ ఫిలిప్స్ సాయంతో డారిల్ మిచెల్ 96 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరి వరకు క్రీజులో ఉండి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

# టాప్‌లోకి దూసుకెళ్లిన విరాట్ కోహ్లీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్ ప్లేస్‌కు చేరుకున్నాడు. ప్రస్తుతం విరాట్ 785 రేటింగ్స్‌తో నెం.1 ర్యాంక్‌లో ఉన్నాడు. గత నాలుగేళ్లలో వన్డే ర్యాంకింగ్స్‌లో నెం.1 పొజిషన్‌కు చేరుకోవడం విరాట్‌కు ఇదే తొలిసారి. అతడు చివరిసారిగా 2021 జులైలో వన్డేల్లో నెం1 ర్యాంక్ సాధించాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 784 రేటింగ్స్‌తో రెండు స్థానంలో ఉన్నాడు. టాప్‌లో విరాట్‌కు, డారిల్ మిచెల్‌కు ఒకే రేటింగ్ పాయింట్ తేడా ఉండడం గమనార్హం. ఇక స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ టాప్ నుంచి మూడో ప్లేస్‌కు పడిపోయాడు. గత కొన్నిరోజులుగా వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ టాప్‌లో ఉన్నాడు. అయితే రీసెంట్



గా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో రోహిత్ స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. అదే సమయంలో విరాట్ గత ఐదు వన్డే మ్యాచ్‌ల్లో 50+ స్కోర్లు సాధించాడు. దీంతో కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకోగా, రోహిత్ రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 775 రేటింగ్స్‌తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. దీజజxాగతేడాది సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ అత్యుత్తం ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విరాట్ రెండు సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సహా 303 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. అంతకుముందు ఆస్ట్రేలియా సిరీస్‌లో మూడో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుతం కివీస్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో విరాట్ 93 పరుగులతో రాణించాడు. తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. అలా విరాట్ ఆడిన ఆఖరి 5 వన్డేల్లో అన్నింట్లోనూ 50+ స్కోర్లు చేశాడు.బౌలింగ్ విభాగానికి వస్తే, టాప్ 5 స్థానాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టాప్‌లోనే ఉన్నాడు.

# సరికొత్త రికార్డ్ సృష్టించిన హర్మన్‌ప్రీత్

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. తాజాగా గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 193 పరుగుల భారీ ఛేదనలో అదిరే ఇన్నింగ్స్‌తో హర్మన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకుంది. 43 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టును గెలిపించింది. ఈ క్రమంలోనే డబ్ల్యూపీఎల్‌లో హర్మన్ అరుదైన రికార్డు తన పేరిట లిఖించుకుంది. ఆ రికార్డు ఏంటంటే? హర్మన్‌ప్రీత్ ఈ ఎడిషన్‌లో సూపర్ ఫామ్‌లో దూసుకుపోతోంది.



దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఇప్పటికే అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్‌గా నిలిచిన హర్మన్, తాజాగా మరో ఘనత సాధించింది. గుజరాత్‌తో మ్యాచ్‌లో సూపర్ ఇన్నింగ్స్‌తో ఆమె డబ్ల్యూపీఎల్‌లో 1000 పరుగులు మైలురాయి అందుకుంది. 55 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హర్మన్ ఈ మైలురాయి అందుకుంది. దీంతో ఈ టోర్నీ హిస్టరీలో ఈ ఘనత సాధించిన భారత తొలి క్రికెటర్‌గా హర్మన్ రికార్డులకెక్కింది. ఇక తాజా మ్యాచ్‌లో హర్మన్ 71 పరుగులతో రాణించింది. ఈ క్రమంలోనే ఆమె మెగ్ లానింగ్, ఎల్లిస్ పెర్రీలను అధిగమించింది. ఓవరాల్‌గా డబ్ల్యూరీపీఎల్‌లో అత్యధిక పరుగులు బాదిన రెండో క్రికెటర్‌గా హర్మన్ కొనసాగుతోంది. ఆమె ఇప్పటిదాకా 30 మ్యాచ్‌ల్లో 46.18 సగటుతో 1016 పరుగులు చేసింది. ఇందులో 10 హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. 95 పరుగులు అత్యధిక స్కోర్‌గా ఉంది. ముంబయి జట్టుకే చెందిన నాట్ సీవర్‌బ్రంట్ 1101 పరుగులతో ఈ లిస్ట్‌లో టాప్‌లో ఉంది.కాగా, ఈ సీజన్‌లో అత్యధిక పరుగుల నమోదు చేసిన బ్యాటర్‌గానూ హర్మన్ టాప్‌లో కొనసాగుతోంది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌ల్లో ఆమె 165.00 యావరేజ్‌తో 165 పరుగులు చేసింది. ఆర్సీబీతో ఆడిన తొలి మ్యాచ్‌లో 20 పరుగులకే వెనుదిరిగిన ఆమె, తర్వాత వరుసగా 74 పరుగులు (ఢిల్లీ క్యాపిటల్స్), 71 పరుగులు (గుజరాత్) రెండు భారీ హాఫ్ సెంచరీలు నమోదు చేసింది.



సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# హాస్యం చుట్టూ తిరిగిన కథ అనగనగా ఒకరాజు

నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజుఅంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలుచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక పల్లెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్ధంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్ధం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.







## తుంబాడ్ దర్శకుడి మరో మూవీ మయసభ

తుంబాడ్' వంటి కల్ట్ క్లాసిక్‌ను అందించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే నుంచి మరో సంచలనం రాబోతోంది. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'మయసభ'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. 'తుంబాడ్' తరహాలోనే ఈ సినిమాలో కూడా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తున్న జావేద్ జాఫ్రీ గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒక కొత్త అవతారంలో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు.

## పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ

### తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్ట్స్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.



## నేనెందుకు క్షమాపణలు చెప్పాలి: మైలకా అరోరా

ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు.



Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005